వ్యవస్థకు
విరుద్ధంగా బ్రతికిన
ఆ ప్రేమికులు
ఒకటయ్యారా?

# జీవితకాలం లేటు

అలపర్తి
రామకృష్ణ కథ

''పెళ్లికి అంత తొందర ఎందుకు? నా మీద నమ్మకంలేదా? నిన్నొదిలి మరొకర్ని పెళ్లిచేసుకుంటానని భయమా?'' అడిగాడు రోహిత్ పార్కులో సీతాకోక చిలుకల్లా కదులుతున్న జంటలను చూస్తూ.

''భయమేముంది... మనిద్దరం జీవితాన్ని పంచుకోవాలని ఎప్పుడో నిశ్చయించుకున్నాం. ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అనే భావనలు లేకుండా అన్యోన్యంగా జీవితాన్ని గడిపేద్దామనుకున్నాం. ఆ మూడు ముళ్లు పడితే మరొకరు మనల్ని వేలెత్తి చూపరు'' అంది పూజిత అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుని సుతారంగా స్పృశిస్తూ.

''మూడు ముళ్లు అవసరమా?''

''మన మధ్య ప్రేమ ఉన్నంతకాలం ఈ ముళ్లూ తాళ్లూ అవసరంలేదుగాని సంఘంలో భార్యాభర్తలుగా గుర్తింపు పొందాలంటే పెళ్లి అవసరమేకదా! పెళ్లనే వ్యవస్థ అవసరం లేకుండానే స్త్రీ పురుషులు అనురాగం, ఆప్యాయతలు పంచుకునే స్థాయికి ఇంకా మన సమాజం ఎదగలేదుగదా'' అంది పూజిత.

''ఈరోజు నీ మాటల్లో అంతా పెళ్లి సందడే కనిపిస్తుందే!'' ఆమె కళ్లలోకి చూస్తూ అన్నాడు రోహిత్.

''శుభలగ్నంలో పెళ్లి చేసుకుని విడిపోయిన వాళ్లు చాలామంది వున్నారు. పెళ్లిచేసుకోకుండానే అన్యోన్యంగా వున్నవాళ్లూ వున్నారు. అది సరేగానీ మనం వెంటనే పెళ్లి చేసుకోవాలి!'' ధృడస్వరంతో అంది పూజిత.

అప్రయత్నంగా అతని చూపులు ఆమె పొత్తికడుపుమీదకు వెళ్లాయి.



''నాకిప్పుడు ఐదో నెల'' అందామె.

ఉలిక్కిపడ్డాడు రోహిత్.

ఆమె మెడలో తాళిబొట్టు కట్టి వుంటే తండ్రిని కాబోతున్నాననే ఆనందం అతడిని ఊపేసేది. నలుగురూ చూస్తున్నా లెక్క చేయకుండా ఆమెను అమాంతం ఎత్తుకుని గిరగిర తిప్పేవాడే. ''గర్భం రాకుండా జాగ్రత పడాల్సిందామె' అనుకున్నాడు అతను

మనస్సులో.

బెల్లం కొట్టిన రాయిలా కూర్చుండిపోయాడు.

పది నిమిషాలు గడిచేకగాని అతని నోట్లోంచి మాట ఊడి పడలేదు.

''గర్భవతిని పెళ్లిచేసుకోవడానికి మా అమ్మానాన్నలు ఒప్పుకోరేమో!'' మనస్సులోని సంశయాన్ని బయటపెట్టాడు.

ఆమె కళ్లల్లో కన్నీళ్లు గిర్రున తిరగబోయాయి. ఆ కళ్లే అతన్ని చూసి మోహంలో పడి ఇబ్బందులకు గురిచేసింది. ఆమె మనస్సు ఆ కన్నీళ్లను కట్టడిలో వుంచింది.

''రాకుమారుడిలా మెరిసిపోతూ కన్పించే అతని శరీరాన్ని చూసి మోహంలో మునిగిపోయి, ఇతరభాగాలన్నీ అతని కౌగిట్లో నలిగిపోయేటట్లు చేశావే! ఇప్పుడేమో కన్నీళ్లు పెట్టుకుంటున్నావా... బుద్ధిలేదూ నీకు... ధైర్యంగా వుండు'' మనసు కళ్లకు బుద్ధిచెప్పింది.

ఆమెను అనునయించే ప్రయత్నం చేయబోయాడు రోహిత్.

''అదికాదు పూజితా! నువ్వంటే నాకు ప్రాణం... ఎన్ని జన్మలైనా నువ్వే నా భార్యవు కావాలని ప్రతిక్షణం అనుకుంటూ వుంటాను... నా ప్రాబ్లం ఏమిటంటే నువ్వు గర్భవతివని తెలిస్తే మా అమ్మానాన్నలు మన పెళ్లికి ఒప్పుకోరు. నువ్వు అబార్షన్ చేయించుకో! వచ్చే నెలలోనే మనం పెళ్లి చేసుకుందాం!'' అన్నాడతను ఆమె చేతిని తన చేతిలోకి తీసుకునే ప్రయత్నం చేస్తూ.

ఆమె మనస్సు అగ్నిపర్వతంలా వుంది. ఏ క్షణాన బద్దలవుతుందో ఆమెకే తెలియని స్థితి. మనస్సుకే అబార్షన్ జరిగినట్లుగా వుందామె మనస్థితి.

స్త్రీ గర్భం వుంచుకోవాలో, తీసేసుకోవాలోనన్న విషయంపైకూడా పురుషుడే నిర్ణయం తీసుకునే పరిస్థితి! అదే పూజితకు నచ్చనిది.

రోహిత్‌తో మరో మాట మాట్లాడకుండా అక్కడినుంచి వచ్చేసింది.

○ ○ ○

ఏడేళ్ల తరువాత పూజిత దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది రోహిత్‌కు.

పొన్నూరులో స్కూలు టీచర్‌గా పనిచేస్తున్నట్లు ఆ ఉత్తరంలో రాసింది. అరిటాకులాంటి సున్నితమైన ఆమెను తను ముల్లులా పొడిచినా, తన తప్పును క్షమించి ఉత్తరం రాయడం అతన్ని కదిల్చివేసింది.

ఉత్తరం అందుకున్న వెంటనే ఇంట్లో తండ్రికి చెప్పకుండా పొన్నూరు బయల్దేరాడు. ఆ ఊళ్లో పూజిత ఇంటి అడ్రస్ కనుక్కోవడం పెద్ద కష్టంగా అన్పించలేదు.

ఇంటిముందున్న మెట్లమీద కూర్చుని ఆడుకుంటున్న ఏడేళ్ల పాప కనిపించింది.

పాలు, మీగడతో చేసిన బొమ్మలా వుంది ఆ పాప. వెన్నెల కిరణాలను వెదజల్లుతున్నట్లున్నాయి పాప కళ్లు.

''ఎవరుకావాలి?'' చక్రాల్లాంటి కళ్లను తిప్పుతూ అడిగింది ఆ పాప.

''పూజిత గారిల్లు ఇదేకదూ!''

ప్లాస్టిక్‌తో చేసిన చిన్న చిన్న పాత్రలు, గ్లాసులు, గ్యాస్‌పొయ్యి ఆకారంలో వున్న బొమ్మ - వంటసామాగ్రి బొమ్మలతో ఆడుకుంటున్నది ఆ పాప.

''ఎండనపడి వచ్చినట్లున్నావ్ కూర్చో! వంట

పని అయిపోయింది... భోజనం చేద్దువుగాని''

పాప ప్రక్కన కూర్చుని తల నిమిరాడు రోహిత్.

''నీ పేరేమిటి?''

''కరుణ'' అందా పాప.

''చాలా బాగుందమ్మా నీ పేరు''

''మా అమ్మ నన్ను కరుణమ్మా, చిట్టితల్లీ అని పిలుస్తూ వుంటుంది. నన్ను ఎప్పుడూ ఎత్తుకుంటుంది. పెద్దమ్మాయిని అయ్యానుకదా! నన్ను ఇంకా చిన్నపిల్లలా ఎత్తుకోవడమేమిటి? నేను నడిస్తే నా పాదాలు అరిగిపోతాయట... మా పిచ్చి అమ్మ నా పాదాలు ముద్దుపెట్టుకుంటూ వుంటుంది'' కబుర్లు చెబుతూనే బొమ్మ గిన్నెలు సర్దుతూ వుంది.

పాప మాటలకు నవ్వొచ్చిందతనికి.

''కాళ్లు కడుక్కోండి'' చిన్న ప్లాస్టిక్ బొమ్మ చెంబు అందిస్తూ అంది.

ఆ చెంబులోని నీళ్లు కాలి బొటన వ్రేలు తడుపుకోవడానిక్కూడా చాలవు. కాళ్లు చేతులు, మొహం కడుక్కున్నట్లు అభినయించాడతను.

చిన్న ప్లేటులో నాలుగు బియ్యపుగింజలు, రెండు కందిపప్పు బద్దలు, చిన్న క్యారెట్ ముక్క వుంచి అతనికి ఇచ్చింది.

''పప్పు ఉడికిందా?''

తలూపేడు.

చెంపకింద చెయ్యి పెట్టుకుని అతనివైపు తదేకంగా చూస్తూ వుండిపోయింది పాప.

''నిన్ను ఎక్కడో చూసినట్లుందే!''


పాప బుగ్గలమీద ముద్దుపెట్టుకున్నాడు గుండెల్లోని తన్నుకొస్తున్న ఉద్వేగాన్ని ఆపుకుంటూ.

''మీ నాన్నను నేనేనమ్మా'' అందామనుకున్నాడు.

''ఆ గుర్తొచ్చింది... మా అమ్మ ప్రక్కన నిలబడి ఫోటో దిగావ్‌కదూ''

''అవునమ్మా'' పాప తల నిమిరేడు.

''ఇంట్లోకి వెళ్దాం రా.. నా బొమ్మలు, పూసల దండలు చూపిస్తాను... ముందు



మంచినీళ్లు త్రాగు. పొలమారుతుంది. మంచినీళ్లు తాగకపోతే ఎక్కిళ్లుకూడా వస్తాయి''

చిన్న గ్లాసులోనీ నీళ్లు త్రాగేక అతని చెయ్యి పట్టుని లోపలికి తీసుకువెళ్లింది. డ్రాయరు సొరుగులోంచి పూసల దండలు, షోకేసులో వుంచిన బొమ్మలు తీసి అతనికి చూపించింది కరుణ.

స్కూలునుంచి పూజిత వచ్చింది అదే సమయంలో.

''పాపా! ఏం చేస్తున్నావమ్మా?'' వరండాలో నిలబడి అంది పూజిత.

తల్లి పిలుపువిని పావురాయిలా గుమ్మం దగ్గరకు దూసుకువెళ్లింది కరుణ.

పాప వెనుకే వచ్చిన రోహిత్‌ను చూడగానే ఆమె మనస్సుఆనందంతో గంతులువేసింది.

''రండి.. కూర్చోండి'' అంది పూజిత.

''కరుణ మర్యాదలన్నీ చేసింది. ఇల్లంతా చూపించింది. నన్నూ ఈ ఇంట్లోని వ్యక్తిలా భావించి చనువుగా నా దగ్గర చేరి కబుర్లు చెప్పింది.'' అన్నాడతను.

''ఈ ఇంట్లోని వ్యక్తి కారా మీరు?'' అడిగిందామె.

మౌనంగా వుండిపోయాడతను.

రాత్రి భోజనాలయ్యేక డాబామీద పక్కలు వేసింది.

వెన్నెల పిండారబోసినట్లు వుంది. పాప నిద్రపోయాక అతని ప్రక్కన చేరింది పూజిత.

''పెళ్లి చేసుకున్నారా?'' అతని ఛాతీమీద చెయ్యివేసి అడిగింది.

''మనస్సునిండా నువ్వు నిండిపోతే మరో అమ్మాయికి చోటేది?'' అన్నాడతను. ఆమెభుజం చుట్టూ చేతులు వేస్తూ.

''నాతోపాటు ఇక్కడే వుండిపోతారా?''

''ఎలా కుదురుతుంది... మా వూళ్లో నాన్న ఒక్కడే వున్నాడు. అమ్మ చనిపోయింది. నేనిక్కడ వుంటే మా నాన్న మా వ్యాపారం గొడవలన్నీ ఒక్కడే చూసుకోలేడు'' అన్నాడతను.

''నన్నూ, పాపను అక్కడికే తీసుకువెళతారా?'' మళ్లీ అడిగింది.

ఓ నిమిషం మౌనంగా వుండిపోయాడు.

''కరుణను మనతోపాటు తీసుకువెళ్లి 'మీ మనవరాలిని' మా నాన్నకు చెబితే నమ్మడు. పాపను రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించి మనిద్దరం మా వూరు వెళ్లిపోదాం'' అన్నాడతను.

ఎవరో గుండెల్లో గునపంతో గుచ్చినట్లు విలవిల్లాడిపోయింది.

అతనికి దూరంగా జరిగి పడుకుంది పూజిత.

మరుసటిరోజు ఉదయాన్నే రైలు ఎక్కేశాడు రోహిత్.

○ ○ ○

కరుణ పెళ్లిరోజువరకూ మళ్లీ పూజితను కలుసుకోలేదు రోహిత్.

పెళ్లిరోజు పట్టుచీర కట్టుకుని తలనిండా కనకాంబరాలు తురుముకుని నుదుట పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకుంది. అందరితో కలివిడిగా మాట్లాడుతూ నిండుగా కన్పించింది పూజిత. రోహిత్‌ను తన ప్రక్కనే నిలబడమని అడిగింది.

'ఈయనే మావారు' అంటూ రోహిత్‌ను అందరికీ పరిచయంకూడా చేసింది. ఆమె అలా అనడం అతనికేమో కొండ ఎక్కినంత సంబరంగా వుంది.

పెళ్లి హడావుడి తగ్గాక -

''కరుణను కాపురానికి పంపించేక నువ్వు నాతోపాటు వచ్చేయగూడదూ?'' పూజితను అడిగాడు రోహిత్.

''నన్ను తనతోపాటే వుండమని అమ్మాయి అంటున్నది. అల్లుడుగారు కూడా అదేమాట అంటున్నారు'' అందామె.

''నీతో కలిసి కాపురం చేసే అవకాశం లేదా నాకు''

''రెండుమూడేళ్లు ఓపిక పట్టండి. అమ్మాయి స్థిరపడ్డాక నేను మీ దగ్గరకు వచ్చేస్తాను'' అంది పూత.

''తప్పంతా నాదే పూజితా! తల్లిదండ్రులకు భయపడి నీకు గర్భం వచ్చినా నిర్లక్ష్యంగా నీకు దూరంగా జరిగిపోయాను. అప్పుడు చేసిన తప్పుకు జీవితాంతం గుర్తుండేటట్లు శిక్ష వేశావ్'' అన్నాడతను రుద్ధమైన కంఠంతో.

అతని ఛాతిని తన చేతుల్లో తీసుకుని మృధువుగా నొక్కింది. ఎవరో అటు వస్తున్నట్లు గమనించి దూరంగా జరిగింది పూజిత.

పూజితనుంచి వచ్చిన ఉత్తరాన్ని పదోసారి చదివాడు రోహిత్.

''ప్రియమైన రోహిత్‌కు -

మీ చేత తాళి కట్టించుకోకపోయినా మిమ్మల్ని నా భర్తగానే ఎప్పుడూ భావిస్తాను. ఓ సంతోషకరమైన వార్త మీకు చెప్పాలనే ఆరాటంతో మీకు ఈ ఉత్తరం రాస్తున్నాను. అల్లుడుగారికి అమెరికాలో ఉద్యోగం వచ్చింది. అమ్మాయిని తీసుకుని ఈ నెల పదో తారీఖు వెళ్తున్నారు.

మీరు వెంటనే రండి.

ఎప్పటికీ

మీ పూజిత

ఎదురుగా టేబిల్‌మీద కనిపిస్తున్న కవరుమీద రోహిత్ దృష్టి పడింది.

ఎప్పటినుంచో ఆస్ట్రేలియా వెళ్లాల్లని అక్కడ నాలుగైదేళ్లు ఇంజనీరుగా పనిచేయాలని ప్రయత్నిస్తుంటే చివరకు ఆ ప్రయత్నాలు సఫలం అయ్యాయి. ఓ ప్రైవేటు కంపెనీనుంచి ఆఫర్ వచ్చింది. పాస్‌పోర్టు, విదేశీ ప్రయాణానికి అవసరమైన కాగితాలన్నీ ఆ కవరులో వున్నాయి. మరోవారం రోజులలో బయలుదేరాలి.

సందిగ్ధంలో పడ్డాడు రోహిత్.

ఆస్ట్రేలియా వెళ్లాలా?...

పూజిత దగ్గరకు వెళ్లాలా?...

చివరకు ఓ నిర్ణయానికి వచ్చాడు. ఐదేళ్లు ఆస్ట్రేలియాలో వుండి తిరిగొచ్చేస్తే పూజితతో జీవితాంతం ఎటువంటి ఆర్థిక ఇబ్బంధులు లేకుండా జీవితాన్ని వెళ్లబుచ్చవచ్చు. ఆమెకు ఉత్తరం రాసి ఆస్ట్రేలియా వెళ్లిపోయాడు రోహిత్. ఆస్ట్రేలియాలో వున్నప్పుడు ఆమె దగ్గరనుంచి ఒక్క ఉత్తరం కూడా రాలేదు. కోపం వచ్చి రాయలేదేమోననుకున్నాడు.

ఐదేళ్లు గడిచేక ఇండియా తిరిగొచ్చాడు. మద్రాస్ విమానం దిగగానే కారు మాట్లాడుకుని నేరుగా పూజిత దగ్గరకే బయలుదేరాడు.

అదివరకు పూజిత ఉన్న ఇంట్లో ఇప్పుడెవరో వుంటున్నారు.

పూజిత గూర్చి వాళ్లను అడిగితే -

''ఆమె చనిపోయి నాలుగేళ్లయింది సార్... ఆమె కూతురు, అల్లుడు అమెరికాలోనే వుంటున్నారు'' చెప్పుకుపోతున్నాడు ఆ ఇంటి యజమాని.

రోహిత్‌కు కళ్లు బైర్లుకమ్మినట్లయింది. నిలబడలేక కూలబడిపోయాడు. ★